క్లుప్తంగా

ఎగ్జిబిషన్‌ను నిలుపుదల చేయాలి



అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్: కడప నగరంలో మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్న వారాహి ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్ కాలపరిమితి పూర్తయినందున వెంటనే దాన్ని నిలుపుదల చేయాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కోరారు. సోమవారం వారు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీకి ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్ కాలపరిమితి పూర్తయ్యిందన్నారు. అయినా ఎగ్జిబిషన్ కొనసాగిస్తున్నారని, నేటి నుంచి ఎన్ని రోజులు నిర్వహిస్తే అన్ని రోజులకు లీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాకానిపక్షంలో ఎగ్జిబిషన్‌ను నిలుపుదల చేయాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కె.బాబు, రామలక్ష్మణ్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, ఎస్. ప్రసాద్‌రెడ్డి, సుబ్బరాయుడు, వి. రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప కోటిరెడ్డి సర్కిల్ : భారత జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జెంగిటి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ సమగ్రతను కాపాడటానికి ముఖర్జీ చేసిన పోరాటాలను వివరించారు. ఆనాటి కాంగ్రెస్ పార్టీ ముఖర్జీని అరెస్టు చేసి జైలులో బంధించి ఆయన మృతికి కారకులయ్యారన్నారు. ఆయన మరణించిన రోజునే బలిదాన్ దివాస్‌గా బీజేపీ జరుపుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, బీజేపీ నాయకులు లక్ష్మిరెడ్డి, శారదమ్మ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూడాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డిలు ఎన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం జరిగేలా చూడాలని పిటిషన్లను సంబంధిత పోలీసు అధికారులకు బదిలీ చేశారు.

హంద్రీనీవా పూర్తి చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బనకచర్ల ప్రాజెక్టు కంటే ముందు హంద్రీనీవా, వంశధార లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఈ విషయంపై రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి అన్నారు. సోమవారం నగరంలోని ఇందిరా భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు అభ్యంతరాలు లేకుండా ప్రాజెక్టులను కట్టుకుంటే మంచిదని ఇరు రాష్ట్రాల సీఎంలకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటామని రేవంత్ రెడ్డి అన్నారన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నీరు అందే విధంగా కృషి చేయాలన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించని పోలీసులు



మాట్లాడుతున్న రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు తస్లీమ్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రజల సమస్యలను పట్టించుకోకుండా డబ్బు, అధికారం కలిగిన వారికి మాత్రమే పోలీసులు సేవలు చేస్తున్నారని రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తస్లిమ్, లక్ష్మీదేవి ఆరోపించారు. సోమవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. శివలింగం బీడీ బజార్‌లో నివాసం ఉంటున్న గౌసియాకు చెందిన బంగారును దొంగలించి, ఆమె ఇల్లును దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గౌసియాను రానివ్వకుండా తన సొంత ఆస్తిలా ఇంటిని అనుభవిస్తున్న వారి ఆడపడుచులు, వారి భర్త యాస్మిన్, పర్వీన్ మా బాషపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మూడు సార్లు ఎస్పీకి తెలియజేశామని, ఆయన టూ టౌన్ సీఐ, ఎస్ఐ లకు ఆ బాధ్యతను అప్పగించారని, అయితే వారు ఎటువంటి దర్యాప్తు చేయలేదన్నారు. ఆ విషయం అడుగుతున్న మహిళ సంఘ నాయకురాళ్ల పై, తమపై దుర్భాషలాడుతూ అధికారాన్ని చలాయిస్తున్నారని తెలిపారు. గంటల తరబడి నిరీక్షించినా తమ సమస్యలను వినే పరిస్థితుల్లో సీఐ, ఎస్ఐ లేరని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శోభారాణి, చాన్ బేగం పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలు



కడప నగరం నుంచి చలమారెడ్డిపల్లె మీదుగా మాచుపల్లె వరకూ ఉన్న రోడ్డు చాలా అధ్వాన్నంగా మారింది. ఇక్కడ తారు రోడ్డు ఉన్నా అది ఉన్న ఆనవాళ్లే కపించకుండా పోయింది. రోడ్డు పొడవునా గుంతలు, రాళ్లు తేలాయి. ఇక వాన వస్తే ఆ గుంతల నిండా నీరు నిల్వ ఉంటోంది. ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ రోడ్డు ఉందో కూడా వాహనదారులు గుర్తించలేరు. సిద్దవటం మండలంలోని అనేక గ్రామాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన దారి కావడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







కల్యాణం.. కమనీయం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగస్త్యేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. సాయంత్రం గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేసి వేద పండితులు ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాయదాయశాఖ సహాయ కమిషనర్, ఏఓ వెంకటసుబ్బయ్య, భక్తుల పాల్గొన్నారు.

ఎక్స్‌రే యూనిట్‌ను అందుబాటులోకి తేవాలి

కమలాపురం: కమలాపురం పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్‌రే యూనిట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు, రోగులు కోరుతున్నారు. గతంలో ఎక్స్‌రే ప్లాంటు ఉండేదని, అయితే టెక్నీషియన్ లేక పోవడంతో అది క్రమంగా మూలకు చేరింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి దాదాపు రూ.8కోట్లు వెచ్చించి అత్యాధునికంగా ఆసుపత్రి నిర్మాణం చేపట్టారు. ఎన్నికలకు ముందు ఆసుపత్రి ప్రారంభోత్సవం కూడా జరిగింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్పందించి ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు రామిరెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య కోరుతున్నారు. అలాగే ఈసీజీ కూడా ప్రింట్ రావడం లేదని దానిపై కూడా శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

చింతకొమ్మదిన్నె : అన్నదాత సుఖీభవ పథకం కోసం ఈకేవైసీ చేయించుకోని రైతులు 102 మంది ఉన్నారని, వారి జాబితాను సంబంధిత రైతు సేవా కేంద్రం నోటీస్ బోర్డ్‌లో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి ఈశ్వరరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రైతులు తమ రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఈకేవైసీ కాని వారు ఈకేవైసీ రెండు రోజులలో పూర్తి చేయించుకోవాలని, లేకుంటే వారికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని తెలిపారు.

మోకాళ్లపై కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్, పట్టణ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి, కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికుల వేతనాలను జీఓ నంబర్ 36 ప్రకారం రూ.21,000 – రూ.24,500 ఇవ్వాలన్నారు. ఆప్కాస్ కార్మికులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, గతంలో 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, పనిముట్లు సకాలంలో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌రెడ్డి, వెంకటేష్, బాలాజీ, భాస్కర్, ప్రమీలమ్మ, గురమ్మ, అన్నపూర్ణ, రమాదేవి, శాంతి, జాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు 13 వేల మంది ఉన్నారని, వారికి 15 వేల రూపాయల వేతనం, పారిశుద్ధ్య కార్మికులకు రూ. 21 వేలు ఇస్తున్నారని తెలిపారు. కానీ, వాటర్ లైటింగ్ హార్టికల్చర్, టౌన్ ప్లానింగ్ లాంటి కీలక రంగాల్లో పనిచేసే ఇంజనీరింగ్ కార్మికుల పట్ల వివక్ష చూపడం తగదన్నారు. పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం చూపడం అన్యాయమన్నారు. ఇంజనీరింగ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి ప్రభుత్వ ఉద్యోగులంటూ పేరు పెట్టడం వల్ల సంక్షేమ పథకాలు వర్తించకుండా పోయాయన్నారు. జీఓ నెం. 36 అమలు చేసి రూ. 21,000 నుంచి 24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎం.విజయ్‌భాస్కర్, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గోపి, ఆనందరావు, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

రైతులందరికీ సుఖీభవ సాయం అందించాలి



కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని డీకేటీ, చుక్కల భూములు సాగు చేస్తున్న వారితోపాటు కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ సాయాన్ని అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, పోతిరెడ్డిభాస్కర్‌లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీకేటీ రైతుల్లో ప్రధానంగా పేద రైతులే ఉన్నారని, అన్నదాత సుఖీభవ పథకం నుంచి వీరిని తొలగించడం అన్యాయమన్నారు. 2014–19లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రైతులకు లక్షన్నర రూపాయలు రుణమాఫీ చేస్తామన్నారని పేర్కొన్నారు. కానీ, రూ. 50 వేలలోపు ఉన్న రుణాలను ఏకకాలంలో మాఫీ చేసి అంతకు పైబడిన రుణాలకు బాండ్లు అందజేశారని తెలిపారు. అయితే బాండ్లకు సంబంధించిన డబ్బులు బ్యాంకుల్లో జమ చేయకపోవడం వల్ల లక్షలాది మంది రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడున్నది కూడా చంద్రబాబే గనుక రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ధరలకు అందించాలని, ప్రాజెక్టుల కింద కాలువల్లో పూడిక తీయించాలన్నారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు శ్రీరాములు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు మనోహర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, వైవీ సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాలచంద్రయ్య, యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యుల సేవలు అభినందనీయం



వైద్యులను సన్మానిస్తున్న మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప జనరల్ ఆసుపత్రిలో కంటి విభాగంలో వైద్య సేవలు అందించి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న వైద్యులు అందించిన సేవలు అభినందనీయమని మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.చిన్నయ్య తెలిపారు. సోమవారం బదిలీపై వెళుతున్న డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ కస్తూరి భాయ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌ఛార్జి ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కిరణ్మయి కాకినాడ గవర్నమెంట్ రంగరాయ మెడికల్ కళాశాలకు, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కస్తూరి భాయిని నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారన్నారు. ఇరువురు కంటి ఆపరేషన్లు చేయడంలో ప్రశంసలు పొందారని, వారు ఎక్కడ పనిచేసినా కంటి రోగులకు ఇలాగే మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆస్మా, డాక్టర్ సూర్య, డాక్టర్ కవిత, డాక్టర్ కల్పన, డాక్టర్ మౌనిక, డాక్టర్ భారతి, డాక్టర్ నరేష్, జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలపై చిన్న చూపు తగదు



డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ విద్యకు ప్రాధాన్యత ఇస్తూ డిగ్రీ కళాశాలల పట్ల చిన్న చూపు చూస్తోందని డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరమణ, సెక్రటరీ శ్రీనివాసులు పేర్కొన్నారు. డిగ్రీ కోర్సు పూర్తి అయినా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు డిగ్రీ కళాశాలలకు ఫీజు బకాయిలు విడుదల చేయలేదన్నారు. ఈ విషయమై సోమవారం డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు కడప కలెక్టరేట్‌లో డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులకు రూ. 15 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ. 15 వేలు ఇస్తూ డిగ్రీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. డిగ్రీ కోర్సు పూర్తి అయినా ఇంతవరకు ఫీజు బకాయిలను ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఇంజనీరింగ్ విద్యకు ఇచ్చినంత ప్రాధాన్యత ప్రభుత్వం డిగ్రీ కళాశాలలకు ఇవ్వడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దీర్ఘకాలిక బకాయిలు చెల్లించి డిగ్రీ కళాశాలలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్స్ సుబ్బారెడ్డి, మేధా నరసంహులు, ఒంటిగారి సుబ్బానాయుడు, సంజీవ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సీఆర్ రెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామికి పుష్పయాగం

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్‌ఆఫీసు వెనుకభాగంలో గల శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరు రోజుల పాటు ఘనంగా జరిగి సోమవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించి చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం వైభవంగా వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండువెంకటరమణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి

కడప రూరల్: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడ పనిచేసిన ఒక అధికారి దాదాపు రూ 3.70 కోట్ల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టారని ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పూర్వ విద్యార్థులకు అభినందన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలో రిమ్స్ సమీపంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు అక్షయ కీర్తన్, కృష్ణ ప్రణీత్ , చక్ర మాధవ్ లు ఈ విద్యా సంవత్సరం నీట్ ఎగ్జామ్ లో వరుసగా 379, 900, 1400 ర్యాంకులు సాధించి అటు కడప నగరానికి, ఇటు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కి ఎంతో మంచి పేరు తీసుకొచ్చారని ప్రిన్సిపల్ అమిత్ సింగ్ పేర్కొన్నారు. సోమవారం నీట్ ఎగ్జామ్‌లో ప్రతిభ కనపరిచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప యాజమాన్యం పాఠశాలకు ఆహ్వానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానాచార్యులు శ్రీనివాసమూర్తి గారు, రిజిస్ట్రార్ రహమతుల్లా పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



భోజనం నాణ్యత పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డి సర్కిల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు కడప నగరంలో సోమవారం ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం, అక్కాయపల్లెలోని ప్రాంతీయ బాల సదన్‌లను తనిఖీ చేసి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. విద్య చాలా విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించాలని సూచించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు విద్యార్థుల విద్య, వైద్యంపట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే కడప న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్స్, బాల సదన్ మేనేజర్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10–30 గంటలకు ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్య, తాగు నీరు, పారిశుద్ధ్యం, ఉపాధి హామీ పథకం మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ. సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు భద్రత అందరి సమష్టి బాధ్యత అని, వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్టీఓ జి. మనీషా సూచించారు. ప్రొద్దుటూరు ఆర్టీఓగా జి. మనీషా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి ఆమె బదిలీపై ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇక్కడ ఆర్టీఓగా పని చేస్తున్న మురళీధర్ మచిలీపట్నంకు బదిలీ అయ్యారు. కార్యాలయంలోని ఎంవీఐలు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు నూతన ఆర్టీఓను కలిసి అభినందనలు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ చెన్నకేశవస్వామి

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలోని పంచలింగాల కోన వద్ద వెలసిన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ 28వ వార్షికోత్సవ పూజలను మాచుపల్లె గ్రామ ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రంగసముద్రం మల్లికార్జునశర్మ.. స్వామి వారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, మహానివేదన, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాచుపల్లె గ్రామానికి చెందిన బి. గంగావీరుడు, కాకర్ల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.